


# కార్మికుని భార్య

మరాఠీ మూలం : యోగిరాజ్ వాగ్‌మారే
తెలుగు అనువాదం : కొక్కుల పద్మావతి

ఆమె మా ఇంటికి వచ్చినప్పుడు ఆమెకు ఆరు ఏడు ఏళ్లు ఉండొచ్చు. ముక్కు మొఖం బాగున్నవి. ఎర్రని ఛాయ. కాని కాళ్లు చేతులు సన్నగా ఉన్నవి. ఒంటిపైన కందిపోయిన జాకెట్, గౌను ఒకటే జత ఉండడం వల్ల అది మాసిపోయినట్లు ఉంది. చింపిరి తల వెంట్రుకలలోకి చేతులు పోనిచ్చి గోకడం ప్రారంభించింది. గోకేటప్పుడు ఆమెది ఒకటే ధ్యాస. తలలో వేళ్లతో ఆమె అసహ్యంగా ఉంది. ఆమె ప్రవర్తన చూసి మాకు అసహ్యం వేసింది. ఎక్కడి నుంచి మా ఇంటికి వచ్చింది ఈ అమ్మాయి అని అనుకున్నాం.

మనసులో ఏమనుకున్నామో జరిగింది ఏమిటి? మనస్సులోనే పాత పని మనిషిని తిట్టుకున్నాం. ఒకవేళ మమ్మల్ని బాధపెట్టడానికే ఈ అమ్మాయిని పంపించిందా ఏం అని అనుకున్నాం. మొదటి రోజే వెళ్లగొట్టాలనిపించింది. పని మనిషి ఎందుకు? ఇంత అస్వచ్ఛమైన మురికి పని మనిషితో పని చేయించుకోవడం కన్న మనమే చేసుకుంటే ఏం పోయింది? అని మా శ్రీమతి అనుకొని ఉంటుంది. అందుకని ప్రశ్నార్థకంగా నా వంక చూసింది. మేమే నిశ్శబ్దంగా నిలబడి ఉండటం చూసి ఆమె చాలా దీనంగా మొఖం పెట్టి ఏడవడం ప్రారంభించింది.

'చిన్నమ్మా' అని సంభోదించి, "నేను అన్ని పనులు చేస్తాను. యమునాబాయి నాకు అన్ని చెప్పింది. మీకు శుభ్రత అంటే ఇష్టం అని. నేను ఇలా ఉన్నానని నన్ను వెళ్లగొట్టరు కదా! వద్దండి నన్ను వెళ్లగొట్టకండి" అని వెక్కి వెక్కి ఏడవ నారంభించింది. మాకు ఏమి తోచడం లేదు. ఒక విధంగా ఈ పని మనుషులు అంతా ఏదో ఓ వంక చెపుతూ ఉంటారు. పని తక్కువ మాటలు ఎక్కువగా ఉంటాయి. కళ్లలో ఎప్పుడు గంగా - యమునలు స్థిరంగా ఉంటాయి. మనము ఏమి అనకముందే అవి పొరలి ప్రవహిస్తూంటాయి. మన నోరు మూతబడుతుంది.

ఆమెకు సర్దిచెప్పడమే కఠినమైపోతుంది. యజమాని ఓడిపోతుంది. పని మనిషిది గెలుపవుతుంది. ఇలాంటి అనుభవం వెనకటికి ఉండటం చేత ఆమె వెక్కి వెక్కి ఏడ్చినప్పుడు ఈ విధమైన బూటకపు ఏడుపు కాదు కదా అని అనుకుందామంటే ఆమె మా ఇంటికి వచ్చి ఇంకా గంట కూడా కాలేదు. ఆమె ఎవరు? ఎక్కడి నుండి వచ్చింది? అని ఏమి అడగనే లేదు. పని గురించి ఏమి చెప్పనే లేదు. అప్పుడే ఆమె ఎందుకు ఏడవాలి. నాకు బాధ కలిగింది. మా శ్రీమతికి ఆశ్చర్యం వేసింది.

ఇంకా మేము ఏమి అననే లేదు ఆమె మాత్రం అసహనంగా కళ్లలో ప్రాణం పెట్టుకొని మా వంక చూస్తుంది. చేతిలో పీచు ఉంది. తలవెంట్రుకలు గాలికి ఎగురుతున్నవి. కొళాయి నీళ్లు మీద పడటం వల్ల ఆమె తడిసిపోయింది. వెక్కివెక్కి ఏడ్వడం వల్ల ముక్కుపుటాలు ఎగురుతున్నాయి. ఆమె ఇంకా ఏమీ తిననందువల్ల వేసారినట్లు ఉంది. నాకు ఆమె కళ్లలో అన్ని తెలిసాయి. ఆ కళ్లూ, ఆ ఏడవడమూ మోసం కాదు. వంక అసలే కాదు. ఇంత చిన్నారి జీవి ఎక్కడ మోసం చేయగలదు. మా శ్రీమతి వెంటనే చెప్పేసింది.

"కాదమ్మి మేము నిన్ను పనిలో నుండి తీసేయం. ఎవరు చెప్పారు నీకు నేను వెళ్లగొడతామని?"

నేను వెంటనే ఇంట్లోకి వెళ్లాను. కాని ఆ పిల్ల నా మనస్సుని ఎంతో వికలం చేసింది. నేను అరుగు మీద పచార్లు కొట్టసాగాను. మా ఆవిడ కడిగిన గిన్నెలు తీసుకువచ్చి వంటింట్లో పెట్టింది. నేను ఆగలేక అప్పుడప్పుడు ఆ పిల్లని గిన్నెలు తోముతుండగా కిటికి నుండి చూస్తున్నాను. ఇప్పుడు ఆమె ధైర్యంగా గిన్నెలు తోముతోంది.

గిన్నెలు కడగటం అయ్యాక ఆమె వంటింటి దర్వాజాలోకి వచ్చింది. తల వంచుకొని, తడిసిన గౌనుని పిండుకుంటూ 'చిన్నమ్మా' అని అన్నది.

"ఏమిటి?"

"నేను వెళ్లనా?"

"ఆగు, చాయి తాగి వెళ్లు"

"వద్దు చిన్నమ్మా"

"మొదటి రోజునే వద్దంటున్నావా, ఆః!"

ఏమీ అనలేక కూర్చున్నది. శ్రీమతి కప్‌సాసర్ పిల్లకు ఇచ్చింది.

"మీరు తీసుకోరా"? ఆమె అన్నది.

"నాది ఎప్పుడో అయిపోయింది"

"అయితే నేను ఒక్కర్తినే తాగను" ఆమె గారాబం.

నేను లోపలి నుండి వారి సంభాషణ వింటున్నాను. అప్పటి నుండి దయనీయంగా ఉన్నా చిన్నారి ఇప్పుడు గారాబం చేస్తూంది. నాకు గమ్మత్తనిపించింది, నవ్వు కూడా వచ్చింది.

"మంచిది" అని శ్రీమతి కూడా గిన్నెలో మిగిలిన చాయి కప్పులో పోసుకుంది.

చాయి తాగిన తర్వాత కప్ సాసర్, చాయి గిన్నె కడిగిన తర్వాత మళ్లీ అన్నది "చిన్నమ్మా నేను వెళ్లనా?" అని.

కొద్ది సేపట్లోనే ఎన్నోసార్లు "చిన్నమ్మా" చిన్నమ్మా

అని అనడం వల్ల శ్రీమతికి సంతోషం కలిగింది.

ఆమె నవ్వి అడిగింది. "నీ పేరేంటి?"

"గీత"

"గీత, చాలా మంచి పేరు."

"మా అమ్మకు ఇష్టమైన పేరు" అంది గీత.

"అంటే నీకు అమ్మా నాన్న ఉన్నారన్నమాట"

ఇప్పటి వరకు మనకు మనం అనుకుంటూ ఉంటాం. గిన్నెలు కడిగేవారు, పని మనుషులు, బాల కార్మికులు, హోటళ్లలో పని చేసేవారు, కార్ఖానాలలో పనిచేసే వారికి తల్లిదండ్రులు ఉండరని, అనాధలే ఇలాంటి పనులు చేస్తూ ఉంటారనుకుంటాం. అందుకని ఎక్కువ ఏమీ అడగకుండా ఏదో మనమే ఊహించుకొని మసులుతూ ఉంటాం. గీత విషయంలో కూడా అలాగే ఉండవచ్చని అనుకొని ఆశ్చర్యంగా అడిగింది.

మా ఆవిడ నుండి అనుకోని ప్రశ్న విని గీత మళ్లీ చిన్నబుచ్చుకుంది.

"చిన్నమ్మా", అని ఏడుపు మొఖం పెట్టింది. ఊరికేనే అడిగి ఆమెను నొప్పిస్తున్నానా అనుకుంది.

ఆమెను ఎలా ఓదార్చాలో అని ఆలోచించే లోపే ఆమె అన్నది.

"చిన్నమ్మా నాకు అమ్మ ఉన్నది. నేను మూడు నాలుగేళ్ల చిన్న పిల్లగా ఉన్నప్పుడే మా నాన్న చనిపోయారు".

ఆమె కళ్లలో నీళ్లు తిరిగాయి. నేను స్థబ్దుగా అయిపోయాను. మా ఆవిడ కూడా క్షణకాలం స్థంభించింది. పిల్లని ఎలా ఓదార్చాలో తెలియకుండా ఉన్నది.

గీత తేరుకుంది. 'వస్తా చిన్నమ్మా' అని ఆమె కళ్లు తుడుచుకుని వెళ్లిపోయింది.

ఆ రోజు మాకు గమ్మత్తుగా గడిచింది. అప్పుడప్పుడు గీత గురించి మాట్లాడుకునే వాళ్లం, అమ్మాయి చాలా బాగుంది!

నిజమే, గిన్నెలు ఎంత శుభ్రంగా కడిగింది. చిన్నమ్మ, చిన్నమ్మ అని ఎన్నిసార్లు పిలిచింది. లేకపోతేనా, వేరే పని మనుష్యులా..........

ఇక నన్ను ఆమె బాబాయి అని పిలువవచ్చు కాని వాళ్ల నాన్న ఎలా చనిపోయారు? వాళ్ల అమ్మ ఎలా బీమారి (రోగిష్టి) అయ్యింది.

పై ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకొమ్మని నేను మా ఆవిడను పురమాయించాను. కాని గీత కోమలమైన మనస్సుకు ఎలాంటి బాధ కలుగకూడదు అని చెప్పాను.

మా శ్రీమతి ఒప్పుకుంది.

మరునాడు నాకు క్యాంపుకు వెళ్లవలసి ఉంది. మూడు నాలుగు రోజులు రావడం కుదరదు.

క్యాంపు ఎలా ముగిసిందో నాకే అర్థం కావడం లేదు. ఇంటికి వచ్చేటప్పుడు ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. శ్రీమతి గీత గురించి అన్నీ తెలుసుకొని ఉండొచ్చు.

నిజంగానే ఆమె అన్ని విషయాలు తెలుసుకుంది. ఆమె చెవుతుంటే నేను వింటున్నాను. ఆమె మొత్తం జీవిత గాధనే నా కళ్లముందు ఉంచింది. "మీరు క్యాంపుకు వెళ్లినాక గీత నన్ను వాళ్ల ఇంటికి తీసుకువెళ్లింది."

"అంటే?"

"వాళ్ల అమ్మని కలవడానికి నేను వెళ్లాను"

"అంటే వాళ్ల అమ్మ మన ఇంటికి రాకుండా నువ్వు వెళ్లావా"

"ఔను"

"వాళ్ల అమ్మ మంచానికి అతుక్కుని పడి ఉంది. రెండు సంవత్సరాలయింది బీమారయి. కాన్సర్ అయింది. బతుకుతుందని ఒక నమ్మకం లేదు. ఆఖరు రోజులు లెక్క పెడుతుంది."

నాకు ఎలాగోలా అనిపించింది. ఏ ఆశతో నేను అడిగాను, నేను వింటున్నది ఏమిటి. ఒకటే గది. మంచంలో ఆమె పడి ఉంది. గీత, ఆమె చిన్న తమ్ముడు ఇంతే ఇంట్లో ఉంటారు. మామయ్య ఇల్లు దగ్గరే కాని వాళ్లవల్ల ఏమీ ప్రయోజనం లేదు.

"అయ్యో ఇది ఎలా జరిగింది" నా ప్రశ్న.

శ్రీమతి చెప్పడం ప్రారంభించింది. గీత వాళ్ల నాన్న శ్యాంరావు ఒక పాత బట్టల మిల్లులో పని చేస్తుండేవాడు. వాళ్ల ఊరు వదిలి షోలాపూర్ వచ్చారు. కలిసిమెలసి మెలిగే స్వభావం. పెళ్లి పనుల్లో, సార్వజనిక పనుల్లో అందరికన్న ముందుండేవాడు. తీరైన కళ్లు ముక్కు నీట్‌గా ఉన్నాడు. ఎర్రగా ఉన్నాడు. గీత వాళ్ల అమ్మ అప్పుడు కార్మికుల 'చాల్' (వాడలో)

గీత ఎవరు? ఎక్కడ నుండి వచ్చింది. మాకు, ఆమెకు ఏమిటి సంబంధం? కాని ఆమె కనబడుతుందా ఇప్పుడు. ఆమె ఏమై ఉంటుంది? ఇలాంటి వెయ్యి ప్రశ్నల్తో నేను వికలం అయ్యాను. ఇప్పటికి నాకు ఆమె గుర్తుకు వస్తేనే నేను ఆమె ఉండే చాల్‌లోకి వెళ్తాను. ఆమె ఉన్న ఇంటి ముందు నిలబడతాను.

ఉంటుండేది. కార్మికులు నిశ్చయించారు ఇలాంటి అమ్మాయి శ్యాంరావుకి బాగా కుదురుతుంది అని, ఇంకేముంది. అందరు వాళ్ల నాన్నని అడిగారు. ఆ వాడలోని కార్మికుల ఆలోచన ఒకే విధంగా ఉంటే వాళ్ల నాన్న మాత్రం ఏం చేయగలడు. చాలా అట్టహాసంగా వెళ్లిపోయింది. రెండు మూడు సంవత్సరాలు చాలా ఆనందంగా గడిచాయి. గీత పుట్టింది. ఒక రోజు మిల్లు మూతపడనున్నది అని పుకారు బయలుదేరింది. మిల్లులో మరియు వాడలో అసంతృప్తి తాలూకు నల్లమేఘాలు అలుముకున్నాయి. కార్మికుల మధ్య గుసగుసలు మొదలయ్యాయి. అందరు ఒకేచోట కలిసారు. సమ్మెలు సభలు మొదలయ్యాయి. కార్మికులు మండిపడ్డారు. అందులో గీత వాళ్ల నాన్న కార్యకర్తగా ముందుకు వచ్చాడు. జనం అతనిని 'కామ్రేడ్' అని సంబోధించసాగారు. అతను కోపంగా, స్వేచ్ఛగా మాట్లాడసాగాడు. సభలలో ప్రసంగించాడు. కార్మికులకు తలలో నాలుక అయ్యాడు.

అయినా ఏది జరగాలో అది జరిగిపోయింది. బట్టల మిల్లు శాశ్వతంగా మూతపడింది. మిల్లుకు తాళం పడింది. ఇళ్లలో పొయ్యిలు వెలగడం బంద్ అయ్యింది. ఇంటి ఇంటికి ఉపవాసాలు ఉంటున్నారు. ఉద్యమాలపైన ఉద్యమాలు నిర్వహించసాగారు. కాని ఏమీ ప్రయోజనం లేదు. శ్యాంరావు ఇంట్లో జీవితంలో చీకటి పడింది. ఇంటికి రాగానే భార్య పిల్లలను చూడగానే అతని మనస్సు విలవిలలాడింది. సమ్మెలు సభలు నిర్వహించి, నిర్వహించి మొత్తం శక్తి అయిపోయింది. ఒకసారి ఒక సభలో మాట్లాడుతుండగా శ్యాంరావుకు కళ్లు తిరిగి పడిపోయాడు. మొత్తం ఆటకట్టయింది. గీత వాళ్ల అమ్మకు వైధవ్యం ప్రాప్తించింది. రెండు ప్రాణులను చేత పట్టుకుని ఆ ఊళ్లో ఆమె బాగా తిరిగింది. ఆమె క్రాంతికారి (విప్లవ) మొగుడు ఎప్పుడు అంటుండేవాడు. గీతకు బాగా చదువు చెప్పిద్దాం. ఒకసారి మిల్లు తెరుచుకోనీ, మనము ఒక ఇల్లు కట్టుకుందాం, పిల్లలని మంచి బళ్లో వేద్దాం అని.

కాని అనుకొన్నది ఒకటి జరిగింది మరొకటి. ఆ విప్లవ కార్మికుని కలలు కలలుగానే మిగిలిపోయాయి. గీతను ఆమె తమ్ముని తీసుకుని వాళ్ల అమ్మ ఇంటి ఇంటికి తిరిగింది. పని మనిషిగా చేరింది. గవర్నమెంటు శాఖలోనో లేక ప్రైవేటు బడిలోనో సేవికగా పని ఇప్పించండని ప్రాధేయపడింది. కాని ప్రతి ఒకరు కామ్రేడ్ భార్య అని ఆమెను తిరస్కరించారు.

నాకు చాలా బాధ కలిగింది. ఒక చిన్నారి పిల్లకు ఈ ప్రపంచంలో ఎన్ని కష్టాలో తెలుసుకోవడం కష్టమే. మా శ్రీమతి చెప్పడం ఆపేసింది. క్షణకాలంలో ధృఢ నిశ్చయానికి వచ్చాను. నా కళ్లముందు జ్వరంతో కొట్టుకుంటున్న నేను చూడని వాళ్ల అమ్మ మెదిలింది. నేను కూడా వాళ్ల ఇంటికి వెళ్లి వాళ్ల అమ్మని చూడాలి అనుకున్నాను. "గీత ఎప్పుడు వస్తుంది" అని అడిగాను.

అయ్యో ఎక్కడ, ఆమె నిన్నటి నుండి వస్తూనే లేదు. అమ్మకు గంజి ఇష్టం అని కొన్ని బియ్యం తీసుకువెళ్లింది. తమ్మునికి పాత బట్టలు తీసుకుపోయింది. నేనే అన్నాను శికాకాయితో తల రుద్దుకో, రిన్ సబ్బుతో బట్టలు ఉతుక్కో మంచిగా తలకు నూనె పెట్టుకోమని. "మంచి పని చేసావు". వద్దు అంటుంది, పిచ్చి పిల్ల ఆ రోజు ఎలా గడిచిందో తెలియలేదు. గీత వాళ్ల అమ్మ ఎలా ఉందో తెలుసుకోవడానికి నేను మా ఆవిడను పంపించాలని అనుకున్నాను. రెండవ రోజు కూడా గీత రాలేదు. గిన్నెలు మా ఆవిడే కడుక్కున్నది. చూస్తుండగానే నాలుగు రోజులు గడిచిపోయాయి. ఒక రోజు సాయంకాలం పూట యమునాబాయి చెప్పింది

"మీకు తెలిసిందా?" అంటూ.

"ఏమిటి యమునాబాయి" అని శ్రీమతి భయపడుతూనే అడిగింది.

"గీతా వాళ్ల అమ్మ నిన్ననే చనిపోయింది"

"అరే, చ్, చ్, చ్" శ్రీమతి తలకు చేయి ఆనించింది. నాకు నోట మాట రాలేదు. గీత ఎవరు? ఎక్కడ నుండి వచ్చింది. మాకు, ఆమెకు ఏమిటి సంబంధం? కాని ఆమె కనబడుతుందా ఇప్పుడు. ఆమె ఏమయి ఉంటుంది? ఇలాంటి వెయ్యి ప్రశ్నల్తో నేను వికలం అయ్యాను. ఇప్పటికి నాకు ఆమె గుర్తుకు వస్తేనే నేను ఆమె ఉండే చాల్‌లోకి వెళ్తాను. ఆమె ఉన్న ఇంటి ముందు నిలబడతాను. గీత లేదా వాళ్ల తమ్ముడు ఎవరో, ఒకరు నాకు కనబడతారా అని వెతుకుతుంటాను. కాని ఎవరూ కనబడరు. ఇప్పుడు అక్కడ మరో కుటుంబం వచ్చింది. నేను నిశ్చలంగా ఆ ఊళ్లో ఏ ఒక వాడలోనో, జన సందోహంలో కలిసిపోతాను.